

# నీ జీవితాన్ని మార్చే దేవుని ప్రేమ లేఖ

నిన్ను అందరూ ద్వేషిస్తున్నారా? ఎవరు ప్రేమించడంలేదా? లోక ప్రేమలో మోసపోయావా? అద్దంలో చూసుకుని ఐ లవ్ యు అని చెప్పలేక పోతున్నావా? నిజమైన ప్రేమకోసం ఎదురు చూస్తున్నావా? ప్రేమ కరువైన నీ జీవితములో నిజమైన ప్రేమ కోసం తపించే నీ హృదయానికి శుభవార్త! నీ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇక్కడ దొరుకుతుంది. అవును ఈ లేఖ నీ కోసమే.

*నా ప్రియమైన బిడ్డ...*

నిన్ను ప్రేమించి నా స్వరూపమందు నా పోలిక చొప్పున నిన్ను పవిత్రముగా సృష్టించాను. (ఆది. 1:26). నేను నీకు తెలియక పోవచ్చు కాని నీ గురించి నాకు అన్ని తెలుసు. జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమ చేత క్రీస్తులో నిన్ను నేను ఏర్పరచుకొనియున్నాను. (ఎఫెసి 1:6). గర్భములో నీవు రూపింపక మునుపే నిన్ను ఎరిగియున్నాను. (యిర్మీయా 1:5). నిన్ను అద్భుతముగా ఆశ్చర్యముగా చేసియున్నాను. (కీర్తన 139:14). నీవు నా సంతానం, నాయందు ఉనికి కలిగి చలిస్తున్నావు. (అపో.కా. 17:26,27). నీవు కూర్చుండుటయు నీవు లేచుటయు నీ పడక నీ నడక నాకు తెలియును నీ మనస్సులో నీకు తలంపు పుట్టకమునుపే నేను ఎరిగియున్నాను. (కీర్తన 139:2,3). నీ తల వెంట్రుకలన్ని లెక్కింపబడి యున్నవి. (మత్తయి 10:30). నీ దినములన్నియు నా గ్రంథములో లిఖితములాయెను. (కీర్తన 139:16). పేరు పెట్టి నిన్ను పిలిచియున్నాను. నీవు నా సొత్తు. (యెషయా 43:10). కాని లోక ప్రేమలో మోసపోయి పాపం వలన పవిత్ర జీవితాన్ని పోగొట్టుకొని నానుండి దూరం అయిపోయావు.

ఒక బిడ్డ పుట్టినపుడు, తన తల్లిదండ్రుల స్పర్శను పొందుకుంటాడు. అక్కడే తల్లిదండ్రుల ప్రేమ (Storge) ప్రారంభం అవుతుంది. తల్లిదండ్రుల ప్రేమను అందరు అనుభవిస్తారు. ఇది మంచి ప్రేమ. కాని ఈ ప్రేమ కూడా కరువైపోతుంది. తల్లిదండ్రుల ప్రేమ శాశ్వతముగా ఉండదు, నీడవలే గతిస్తుంది. తల్లియైన తండ్రియైన మరచుదురు గాని నేను నిన్ను మరువను (యెషయా 49:15). **"శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను."** (యిర్మీయా 31:3). ఆ బిడ్డ మరల 5 సం॥లు వచ్చిన తరువాత తన వయసులో ఉన్న స్నేహితుల ప్రేమ (Phila) కావాలని కోరుకుంటాడు. వీరే చిన్ననాటి స్నేహితులు ప్రాణ స్నేహితులు అంటారు. ప్రాణాల మీదికి వస్తే ఏ స్నేహితుడు దరికిరాడు. ఈ ప్రేమ అవసరానికి వాడుకునే ప్రేమ. కాని నేను నీ అవసరాలను తీర్చి నిన్ను చిరకాల స్నేహముతో ప్రేమిస్తున్నాను. ఆ బిడ్డ మరల 14 సం॥లు వచ్చినపుడు వేరే లింగ ఆకర్షణతో శారీరక సంబంధాన్ని కోరుకుంటాడు (Erotic). ఒక్కసారి కోరిక తీరాక వాళ్ళు మోసం చేస్తారు. ఇది ప్రారంభములో హాయిగా ఉండవచ్చు కాని ఈ ప్రేమ నీపై ఉన్న అందాన్ని, నీ డబ్బుని, నీస్టేటస్‌ని చూస్తుంది. స్వార్థం కలిగిన ప్రేమ లాభం కోరే ప్రేమ. ఈ ప్రేమ ముసుగులో పడి చివరకు ఎంతోమంది అమ్మాయిలు అబ్బాయిలు వారి జీవితాలను క్యారెక్టర్‌ను నాశనం చేసుకున్నారు. కాని నా ప్రేమ పరిశుద్ధమైనది. నీ క్యారెక్టర్‌ను పరిశుద్ధముగా కాపాడేది నా ప్రేమ. నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులుగా ఉండుడి.

చిన్నప్పుడు బిడ్డ పుట్టగానే ఏడుస్తాడు. ఎందుకంటే ఊపిరి తిత్తులు ఖాళీగా ఉంటాయి. ఆ బిడ్డ ఎదిగినప్పుడు మరలా ఏడుస్తాడు ఎందుకంటే దాహముతో పొట్ట ఖాళీగా ఉండి తరువాత మళ్ళీ ఏడుస్తాడు ఆకలితో కడుపు ఖాళీగా ఉండి. అయితే ఎదిగి పెద్దవాడైనప్పుడు మరలా ఏడుస్తాడు ఈసారి ఏడ్చేటప్పుడు ఎందుకు ఏడుస్తున్నాడో ఎవ్వరికీ తెలియదు. ఎందుకు ఏడుస్తున్నాడో తెలుసా? తను హృదయం అంతా ఖాళీగా ఉండి. అక్కడే నాప్రేమ ప్రారంభం అవుతుంది (Agape Love). ఆకలి వేసే కడుపుకి ఆహారం లేకపోతే ఆకలి అనే మాటకు అర్థం లేదు. దాహం వేసే పొట్టకి మంచినీళ్ళ లేకపోతే దాహానికి అర్థం లేదు. ప్రేమకోసం తపించే నీ హృదయానికి నిజమైన ప్రేమతో తృప్తినిచ్చే దేవుడను నేనే లేకపోతే ఆ ప్రేమకు అర్థంలేదు. నిన్ను సృష్టించినప్పుడు నా ప్రేమకు నీలో ఒక ఆకారము పెట్టుకున్నా. ఆ ఖాళీ హృదయములో ఏది ఉంచినా నీకు సంతృప్తి ఉండదు. నీలోకి నేను వస్తేనే నీకు సంతృప్తి ఉంటుంది. భర్తను ప్రేమిస్తే, పిల్లలను, బంధువులను, స్నేహితులను ప్రేమిస్తే, నిన్ను నీవే ప్రేమిస్తే ఆ ప్రేమ అక్కడితోనే ఆగిపోతుంది. కాని నీవు నాకు ఐ లవ్ యు చెప్పితే నన్ను ప్రేమిస్తే నేను నీ తల్లిదండ్రలను ప్రేమించమంటాను. నీ భర్తను, నీ భార్యను, నీ పిల్లలను, బంధువులను, నీ పొరుగువారిని, నీవు నిన్ను ప్రేమించుకోమంటాను మరియు నీ శత్రువులను సహితం ప్రేమించమనేది నా ప్రేమ. అందరికంటే నన్ను ఎక్కువగా ఎందుకు ప్రేమించమన్నానో తెలుసా. ఎందుకంటే నాకంటే ఈ లోకంలో ఎవరినైనా దేనినైనా ఎక్కువగా ప్రేమించిన నీకు కలిగేది దు:ఖము. ప్రేమ ఉన్నచోట నేను ఉంటాను. ప్రేమ లేని చోట నేను ఉండను. నేను ప్రేమయైయున్నాను, **నేను ప్రేమా స్వరూపిని** (యోహాను 4:8). నీ జీవిత ఉన్నత శిఖరాలను కోరేది నా ప్రేమ. విరిగిన హృదయము గలవారికి నేను ఆసన్నుడను, నలిగిన మనస్సు గలవారిని నేను రక్షించుదును. గుండె చెదరిన వారిని నేను బాగు చేయువాడను, వారి గాయములు కట్టువాడను. **నేను లోకమును ఎంతో ప్రేమించాను.** (యోహాను 3:16). ఎంతగా అంటే ప్రాణం పెట్టి వెల్లడి పరిచాను **ఎట్లనగా లోకములో మనుషులందరు పాపులై యుండగానే నేను మీ కొరకు రక్తం కార్చి చనిపోయాను** (రోమా 5:8). నేను ప్రపంచమంతటినీ ప్రేమిస్తున్నాను. నీది ఏ కులమైనా ఏ జాతైనా, ఏ వర్గమైనా నీవు నల్లగా ఉన్నా, తెల్లగా ఉన్నా, పొట్టిగా ఉన్నా పొడవుగా ఉన్నా, అందంగా ఉన్నా లేకపోయినా, నీకు చదువు ఉన్నా లేకపోయినా నిన్ను నిన్నుగా ప్రేమించేదే నా అగాపే ప్రేమ. నిన్ను ప్రేమించేవారు ఎవరూ లేరా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ జీవితాన్ని నాకు ఇచ్చెయ్! ఇప్పటి వరకు అనేకమైన ప్రేమలను ప్రయత్నించావు. నా ప్రేమను ఒక్కసారి ప్రయత్నించు. ఎందుకంటే నా ప్రేమ నీ జీవితాన్ని మారుస్తుంది. నా ప్రేమ తాగుబోతులను మార్చింది, తిరుగుబోతులను మార్చింది, వ్యసనములనుండి విడిపించేది నా ప్రేమ. నాప్రేమ పాపమునుండి పవిత్రముగా చేసేది. నా ప్రేమ నరకాన్ని నుండి తప్పించి, పరలోకానికి చేర్చేది. ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చి,అతనితో నేనును, నాతోకూడా అతడును భోజనము చేయుదుము. నీ హృదయమనే తలుపును తట్టుచున్నాను. తెరుస్తావని అన్నివేళలా ఎదురు చూస్తూ ఉన్నాను....

**-నీ ప్రియమైన యేసయ్య**

<u>ప్రార్థన :</u> యేసయ్యా నీవు నన్ను ప్రేమిస్తున్నావు, అందుకే నన్ను సృజించావు. నేను ఎంత చెడ్డ వ్యక్తినైనా నాకోసం సిలువ మీద రక్తం కార్చి నా పాపాన్ని తుడిచివేయడానికి ప్రాణం పెట్టావు. యేసయ్యా నీ ప్రేమ గొప్పది. యేసయ్యా నిన్ను నా స్వంత రక్షకునిగా ప్రభువుగా అంగీకరిస్తున్నాను. నా హృదయమనే తలుపును తెరుస్తున్నాను. ఈనాటినుండి నీ ప్రేమకు రక్షణకు సాక్షిగా నన్ను మార్చమని యేసయ్య నామములో ప్రార్థిస్తున్నాను తండ్రీ! ***ఆమెన్.***

మీ ప్రార్థనలు, సలహాలు & కరపత్రికల కొరకు సంప్రదించండి.
ప్రభువునందు మీ సహోదరుడు : బ్రదర్. **జి. దానియేలు.**
సెల్ : **8639904199.** E-mail:jgpldrt7@gmail.com